# తీర్పు

**— రాపేటి రామకృష్ణారావు**

సికింద్రాబాద్ స్టేషను జనంతో కిటకిట లాడుతోంది. ప్లాట్ ఫారం అంతా కదిలే జనం, కదల్లేని లగేజీతో కలగాబులగంగా వుంది. అందరి కళ్ళూ ఆతృతగా గోదావరి రైలు బండి రాక కోసం ఎదురు చూస్తున్నాయి. కాని నలుగురితో బాటు నారాయణా అని కాకుండా కొడుకు సురేష్‌తో పాటు ట్రంకు పెట్టె మీద కూర్చున్న పద్మావతి రెండు కళ్ళూ మాత్రం ఆమె భర్త వెంకటరావు కోసం ఎదురు చూస్తున్నాయి.

రైలు రావడానికి ఎంతో వ్యవధిలేదు. ఏడున్నర కొస్తుంది. నాలుగున్నర గంటల కనగా స్టేషను వదిలి పెట్టి వెళ్ళిన మనిషి, మూడు గంటలు దాటి పోతుంది. యింత సేపు ఏమిచేస్తున్నట్టు!

సాయంత్రం నాలుగు గంటలకే లగేజీతో స్టేషన చేరుకున్నారు. రిజర్వేషను వారం రోజుల క్రితమే అయిపోయింది. బండిరాగానే రిజర్వుడు కంపార్టు మెంటులోకి ఎక్కెయ్యడమే. అయితే మాత్రం. పాట్ మార్కెట్‌కి వెళ్ళి షేర్ మల్ జెయిన్ దుకాణంలో అర తులం బంగారం కొని తేవడానికి యింత సేపా. మొదట విశాఖపట్నంలోని మంచుకొండ వారి దుకాణంలోనే కొందాం అనుకున్నారు. కాని బంగారం కోసం మళ్ళీ పని కట్టుకుని విశాఖపట్నం వెళ్ళాలి. పెళ్ళివారం రోజులు కూడా లేదు. అనకాపల్లిలో దిగిన వెంటనే కంసాలి కిచ్చి మంగళ సూత్రం చేయించ వచ్చును గదా అని తనే ఈ బంగారం పని పెట్టింది. బంగారం కొనేసి వచ్చేటప్పుడు తాము రైలులో తినడానికి ఓ డజను అరటి పళ్ళు కూడా కొని తెమ్మని బొడ్డులో దోపుకున్న పన్నెండు వందల లోనుంచి వెయ్యి రూపాయిలు యిచ్చి పంపించింది.

మరోసారి స్టేషనులోకి ప్రవేశించే ద్వారం వేపు కలయజూసింది. సూట్ కేసులతో ఎందరో ప్రవేశి స్తున్నారు. కాని ఆమెకి భర్త దర్శనం కాలేదు. క్షణ క్షణానికి ఆమె గుండెల్లో భయం ఎక్కువ కాసాగింది. ఆమె అలోచనలు కళ్ళెం తెగిన గుర్రపు కాళ్ళలాగా అటూ యిటూ పోసాగినాయి.

డబ్బెక్కడైనా పారేసు కోలేదు గదా! లేక ఎవరైనా కొట్టేశారా? అమ్మో అలాగైతే యింకా ఏమన్నా వుందా సంబంధం చూడడమే కాకుండా ఖర్చులు పెట్టుకుని పెళ్ళి జరిపిస్తున్నాడు అన్నయ్య. కనీసం మంగళ సూత్రమైనా చేయించక పోతే ఏం బాగుంటుంది.

ఆలస్యం అవుతున్న కొద్దీ ఆమె మనస్సు కీడునే శంకించ సాగింది. ఒక సంగతి జ్ఞాపకం రాగానే ఆమె గుండె ఝల్లుమంది. "ఒక వేళ ఈయనగారు గాని మళ్ళీ అక్కడికే చేరుకోలేదు గదా! ఛీ, అలా ఎన్నటికీ చెయ్యడు. కన్న తండ్రిగా ఎప్పుడూ దానికి ఒక గౌను కొన్న పాపాన పోలేదు. పెళ్ళి కాబోతున్న కూతురి మంగళ సూత్రం డబ్బుతో అంత పని ఎన్నటికి చెయ్యడు" అని పదే పదే అనుకున్నా గతంలోని చేదు అనుభవాలు ఆమెని భయపెట సాగాయి.

* * *

పెళ్ళి అయితే చాలు ఆడపిల్ల సమస్యలు తీరి పోతాయంటారు. కాని పద్మావతి విషయంలో అలాగ జరగలేదు. ఆమెకి పెళ్ళి అయిన దగ్గర నుంచే సమస్యలు మొదలైనాయి.

కలవారింట్లో పుట్టింది. అల్లారు ముద్దుగా పెరిగింది. ఇరవై ఏళ్ళ క్రితం. పదిహేనో ఏట అనకాపల్లి గవరపాలెం హైస్కూలులో పది చదువు తుండగా ఆమె వివాహం జరిగింది.

మునగపాకలో పదెకరాల పొలం, హైదరాబాదులో వుద్యోగం, ఒక్కడే ఆస్థికి వారసుడు అని వెంకటరావు కిచ్చి పెళ్ళి చేశారు.

పాపం పద్మావతి హైదరాబాదు జీవితాన్ని తలచుకుని ఎన్ని రంగుల కలలు కన్నదో! ఆ కలలన్నీ కల్లలే అయ్యాయి. హైదరాబాదులో కాపురం పెట్టిన ఒక ఏడాదైనా సుఖంగా వుందోలేదో, రెండో ఏడు తిరక్కుండానే అమ్మాయి జలజ పుట్టింది. అంతే తరవాత సుఖం అనేది మరిచి పోయింది. వెంకటరావులో చాలా మార్పులు వచ్చాయి. రాత్రి పదిగంటల దాకా యిల్లు చేరేవాడు కాదు. ఒకో రోజైతే రాత్రి రెండు గంటలు కూడా అయ్యేది. పద్మావతి కళ్ళు మొదట చెరువు లయ్యేవి. తరవాత తరవాత నిరాశను నింపుకుని ఎండి బీడులయ్యాయి.

మొదట మొదట్లో కారణం అడిగేది. రెండో ఆట సినిమాకెళ్ళేనని చెప్పేవాడు. నమ్మడానికి పద్మావతి పిచ్చిది కాదు. సాయంత్రం అయిదు గంటలకు రావలసిన మనిషి రాత్రి రెండు గంటలకు వచ్చి రెండో ఆట సినిమాని సాకుగా చెప్పితే అబద్ధం చెపుతున్నాడని ఎవరు తెలుసుకోలేరు. కాకపోతే, అబద్ధం చెపుతున్నాడని. తెలిసీ ఎదురు ప్రశ్నలు వెయ్యడం వల్ల మరో వంద అబద్ధాలాడించడమే గాని లాభం వుండదని వూరుకునేది.

నిజం దాగేది కాదు గనక దానికదె బయట పడింది. వెంకటరావు పేకాట ఆడతాడని ఆ నోటా ఈ నోటా పద్మావతికి తెలిసి పోయింది. ఆ రోజుల్లో పేకాట అంత ప్రమాదమైనదని ఆమెకి తెలియదు. ఆ పేకాటే వాళ్ళ భూములు, ఆస్థితో పాటు మర్యాదని కూడా మంట కలుపుతుందని తెలిస్తే అంత ఉదాసీనంగా వుండేది కాదేమో.

రోజు రోజుకీ అలవాటు ముదిరిపోయింది. ఒకో రోజు యింటి ముఖం చూసేవాడు కాదు వెంకటరావు. జీతం అందిన రోజు అందరికీ పండగ, పద్మావతి యింట్లో పండగ మాట దేవుడెరుగు చేతిలో ఒక అరటి కాయ లేకుండా, జీతం మొత్తం పేకాటలో తగలేసే దాకా వచ్చేవాడే కాదు. అయినా పద్మావతి తన భర్తమీద అన్నయ్యకు పితూరీలు రాయలేదు. ఎలాగ తెలిసిందో అనకాపల్లి నుంచి వచ్చాడు. బుద్ధి చెప్పబోయాడు. వెంకటరావు మొండి సమాధానాలు చెప్పాడు. మాటా మాటా పెరిగింది.

"నాజీతం. నేను ఖర్చు పెట్టుకుంటాను. నా ఆస్థి నేను తగలేసుకుంటాను. నా యిష్టం. నువ్వెవడివి చెప్పడానికి. గెట్ అవుట్" అనేశాడు వెంకట రావు.

అయినా ఆరు నెలలకీ, ఏడాదికీ వాళ్ళమ్మ చేత బియ్యం, కావలసిన యితర సామానూ పంపించేవాడు పద్మావతి అన్నయ్య. వీలున్నప్పుడు వచ్చి చూసి పోతుండేవాడు కూడాను. వాళ్ళన్నయ్య అండ గనక లేక పోతే పద్మావతి బ్రతికి వుండేది కాదు అని ఆమెని ఎరిగిన ప్రతి వాళ్ళూ చెపుతారు.

వెంకటరావుని మార్చడానికి పద్మావతి ఏమీ చెయ్యక పోయినా వాళ్ళన్నయ్య అనేక ప్రయత్నాలు చేశాడు. ముఖ్యంగా పద్మావతిని తనతో వచ్చెయ్యమన్నాడు.

"పద్మా! వాడికి బుద్ధి రావాలంటే నువ్వునాతో వచ్చెయ్యి. ఏడాది తిరక్క ముందే వాడికి తిక్క కుదురుతుంది. తిండీ తిప్పలూ లేక పోతే నిన్ను వెతుక్కుంటూ వాడే వస్తాడు" అని బ్రతిమాలాడు.

పద్మావతి వినలేదు. "రాలేనన్నయ్యా! ఎప్పుడూ చీకటే వుంటుందా? ఎద్దు ఒక పక్కే పడుకుంటుందా? ఆయన మారుతారు. నేను ఆయన్ని వదిలేసినా ఆయనే నన్ను వదిలేసినా లోకం ఆడదాన్నే తప్పుపడుతుంది గనక ఆయన మరింత చెడిపోతే రేపు నాకే మాట వస్తుంది" అనేసింది.

"నీ ఖర్మ" అని వదిలేశాడు వాళ్ళన్నయ్య.

పద్మావతి సహనం ఆ కుక్క తోకని తిన్నగా చెయ్యలేక

**రోజు రోజుకి అలవాటు ముదిరిపోయింది. రెండు రోజులకోరోజు ఇంటి ముఖం చూసేవాడు కాదు. జీతం అందిన రోజు అందరికీ పండగ. ఇంటి సంగతి దేవుడి కెరుక. మొత్తం పేకాటలో తగలేసికాని ఇంటికి వచ్చేవాడు కాదు.**



పోయింది. వెంకటరావు దొరికిన చోటల్లా అప్పులు చేసేశాడు. అప్పుల వాళ్ళు పీకల మీద కూర్చున్నారు. మునగపాకలోని భూముల మీద కూడా అప్పులే. పద్మావతి అన్నయ్య మధ్యవర్తిత్వం వహించి భూములమ్మి ఆ అప్పులన్నీ తీర్పేశాడు. ఆరో ఏట ప్రవేశించిన జలజని అనకాపల్లి తీసుకు పోయి బడిలో వేశాడు. పద్మావతికి తరవాత మగపిల్లవాడు పుట్టాడు. మరి పిల్లలు పుట్టకుండా ఆపరేషను చేయించుకుంది. ఎన్నో వసంతాలు భారంగానే గడిచి పోయాయి.

పద్మావతి చేసిన మంచి పనుల్లో తనకాళ్ళ మీద నిలబడే ప్రయత్నాన్ని చెప్పుకోవాలి. కాలక్షేపంగా వుంటుందనే, ప్రక్కయింటి సరోజ దగ్గర కటింగూ, వాళ్ళ మిషను మీదే కుట్టడం కూడా నేర్చుకుంది. బాగా చేర్చుకున్న తరవాత వాళ్ళన్నయ్యకి రాసింది. ఆయన వచ్చి ఒక కుట్టు మిషను కొనియిచ్చాడు. వాళ్ళవీ వీళ్ళవీ జాకెట్లూ, ఫ్రాకులూ, లంగాలూ కుట్టి రోజుకి అయిదూ పదీ సంపాదించడం నేర్చుకుంది. ఒకోరోజైతే యిరవై రూపాయిల దాకా సంపాదించేది. పద్మావతికి రెక్కలొచ్చినట్లయ్యాయి. భర్త సంపాదన మీద ఆధార పడడం మానేసింది. నెలకి వందయిస్తే వంద, యాభై యిస్తే యాభై తీసుకుని మహా ప్రసాదం అని వూరుకునేది.

అలా గడుస్తున్న పద్మావతి జీవితంలో ఒకనాటి సంఘటన ఆమె మనస్సుని కలచివేసించి. ఆరోజుని మాత్రం మరిచి పోలేక పోయింది. ఆరోజే కన్న తండ్రి అన్న పేరుకి కళంకం తెచ్చాడు వెంకటరావు.

సురేష్‌కి జ్వరం. ఒళ్ళు పెనంలాగా పేలిపోసాగింది. పద్మావతికి పై ప్రాణం, ఓదార్పు, తోడు, అన్నీ సురేష్.

ప్రక్కనే వున్న డాక్టరుకి చూపించింది. టెంపరేచరు 105 డిగ్రీలు వుంది. చీటీ రాసి ఇంజక్షను, బిళ్ళలు కొని వెంటనే తీసుకు రమ్మన్నాడు. గంటలో ఇంజక్షను యివ్వక పోతే విషజ్వరం యింకా విషమిస్తుందనీ ప్రాణా పాయమనీ కూడా చెప్పాడు. పద్మావతికి భయం వేసింది. దగ్గరున్న యిరవై రూపాయిలూ చీటీ వెంకటరావుకి యిచ్చింది. పది నిముషాల్లో రాక పోతే ప్రమాదమని చెప్పింది.

అంతే సాయంత్రం దాకా వెంకటరావు రాలేదు. మందులూలేవు. దేవుడు లాగ ఆ డాక్టరే స్వయంగా వెళ్ళి ఆయన డబ్బుతోటి వెంటనే ఇంజక్షను తెచ్చి చెయ్యక పోతే సురేష్‌కి ప్రమాదం జరిగేదే! ఎన్ని దురంతాలు చేసినా క్షమించింది. కొడుకు విషయంలో అలాగ చేయగానే ఆడ పులి లాగ ఎదురు చూసింది. పిల్లిలాగా యిల్లు చేరాడు వెంకటరావు. భార్యను చూసి మొదటి సారి భయపడ్డాడు. డబ్బు పడి పోయిందనీ, అప్పు కోసం తిరుగుతూ వుండి పోయాననీ చెప్పి తప్పించు కున్నాడు. ఆ మరునాడే ఒక పేకాట స్నేహితుడు మాటల్లో వెంకటరావు పేకాట ఆడినట్లు చెప్పేశాడు. లేకపోతే ఆ చేదు అబద్ధాన్ని ఎప్పటికీ నమ్మేసేదే.

తెలుసుకుని మాత్రం ఏమి చెయ్య గలిగింది. నిలదీసి అడిగితే "పద్మా! పేకాటలో లక్షలు పోగొట్టు కున్నాను. ఆ డబ్బుని మళ్ళీ అణా పైసలతో సహా రాబట్టు కునే దాకా ఆ బ్రహ్మ దేవుడు దిగివచ్చి చెప్పినా పేకాట మానలేను" అని తెగేసి చెప్పాడు. "డబ్బు దొరికితే పేకాటే" అని నొక్కి మరీ చెప్పాడు.

అంతే! ఆ నాటి నుంచీ భర్త అంటేనే అసహ్యం పెరిగి పోయింది. చిల్లుకానీ కూడా వెంకటరావుకి దొరక నియ్యకుండా జాగ్రత్త పడింది.

పోయిన ఏడాదే జలజకి సంబంధం కుదిరిందని వాళ్ళన్నయ్య రాశాడు. అప్పటి నుంచీ 15 మంది కలిసి చిట్ వేసుకుంటుంటే అందులో చేరింది పద్మావతి. నెలకి వంద రూపాయిలు కలుపుతూవచ్చింది. పది రోజుల క్రితమే ముహూర్తం అదీ నిర్ణయించి రమ్మని పద్మావతికి వాళ్ళన్నయ్య రాశాడు. మూడు వందల నష్టానికి చిట్ పాడి పన్నెండు వందలూ తీసుకుంది. పోయిన వారమే రిజర్వేషను చేయించి ఆ సంగతి వాళ్ళన్నయ్యకి కూడా వుత్తరం రాసింది.

*    *    *

ఒక్కొక్క సంఘటన సినిమాలాగా పద్మావతి మనోపథంలో దృశ్యాలు కట్టాయి.

ఏడాది నుంచీ కష్టపడి దాచిన డబ్బు. ఎంత పొరపాటు చేసింది. డబ్బు యిస్తున్నప్పుడు తనకి ఆ పేకాట సంగతి జ్ఞాపకం రాలేదేం! ఆయన కను మరుగయ్యేలోపున జ్ఞాపకం వచ్చినా ఆపేసి అనకాపల్లి లోనే కొందాంలేండి అని చెప్పి తీసేసుకునేదే. సురేష్‌ని సామాను దగ్గర వుంచి తనైనా వెళ్ళిందా?

ఛీ, తనెందుకిలాగ ఆలోచిస్తోంది. కూతురి పెళ్ళి, ప్లాట్‌ఫారం మీద భార్య కొడుకు ఎదురు చూస్తుంటారు అనే ఇంగితం ఆయనకి మాత్రం వుండొద్దా? ఎన్ని జాగ్రత్తలని తీసుకోగలదు. అయినా తను యివ్వకుండా వుండవలసింది. వింటే అన్నయ్య కూడా తిడతాడు. తన ఖర్మకాక పోతే తుమ్మితే వూడిపోయే ముక్కా? తాళికట్టిన భర్త, పిల్ల పెళ్ళి చెయ్యాలనే తపన తనకే గాని ఆయన కుండవద్దా? ఒకరు చెప్పాలా?

అపుకోలేనంత దుఃఖం ముంచుకొచ్చింది పద్మావతికి. కన్నీళ్ళు జలజలా రాలసాగాయి. సురేష్‌కి వాళ్ళమ్మ కన్నీళ్ళు చూసినప్పుడల్లా గుండె కోసినట్లుంటుంది. తండ్రి మీద కసి పెరిగి పోతుంటుంది. పెద్దయాక ఒక గుణ పాఠం చెప్పాలని ఎప్పుడో నిశ్చయించుకున్నాడు. పదేళ్ళు వచ్చాయి. మరో పదేళ్ళు కష్టపడి చదువుకుని ఏదైనా ఉద్యోగం దొరకాలి. అప్పుడు చూపించాలి తన తడాకా అనుకున్నాడు.

రైలు ప్లాట్‌ఫారం మీదకి రావడం చూసిన సురేష్ "అమ్మా రైలొచ్చేసిందే" అన్నాడు.

పద్మావతి ఆలోచనలకు బ్రేక్ పడింది గబగబా చీర చెంగుతో కళ్ళుతుడుచుకుంది. భర్త వెంకటరావుకోసం మరోసారి చుట్టూ పరికించింది. కనిపించలేదు. భర్త రావడం కల్ల అని నిర్ధారించుకుంది. అదేరోజు రైలెక్క పోతే మరునాడు అనకాపల్లి స్టేషనులో వాళ్ళన్నయ్య ఎదురు చూస్తుంటాడు. ఎందుకు రాలేదో తెలియక కంగారు పడతాడు. టిక్కెట్ల రిజర్వేషను డబ్బా అదీ దండగ అవుతుంది. దేవుడి దయవలన రైలు బయలు దేరే, సమయానికి వస్తే వస్తాడు లేక పోతే తన దురదృష్టం అనుకుని సామాను రైలు ఎక్కించేసింది. సురేష్‌ని బెర్తు మీద కూర్చోమ్మని తాను కిటికీ దగ్గర కూర్చుని భర్తరాక కోసం ఎదురు చూడసాగింది.

వెంకటరావు వెయ్యి రూపాయిలూ జేబులో వేసు కున్నాడు. డబ్బు చేతిలోవున్నప్పుడల్లా అతనికి జ్ఞాపకం వచ్చేది పేకాట. ఆ డబ్బు అతనిదే కానక్కరలేదు. టైము చూసుకున్నాడు. ఇంకా అయిదు గుంటలు కూడా కాలేదు. నాలుగు గంటలకే రామారావు యింట్లో ఆట మొదలౌతుంది. కృష్ణమూర్తి యాదయ్యా కూడా ఈ పాటికి వచ్చేవుంటారు. అనుకున్నాడు. పేకాట వ్యసనం బాగా వంటబట్టిన మనిషి వెంకటరావు. అందులో వున్న ఆనందం మరింకెందులోనూ అతనికి కనిపించదు. వెళ్ళి నాలుగు ఆటలు ఆడితే నో అనిపించింది. కాళ్ళు అటు లాగేశాయి.

వెంకటరావు ఎప్పుడూ వేల కు వేలు ఓడిపోవడం, ఎప్పుడైనా వందా యాభై గెలవడం జరుగుతుంటుంది. ఆ గెలిచిన రోజున అందుకూ యిందుకూ ఖర్చు పెట్టేస్తాడు. సిగరెట్లు బాకీ, టీ కొట్లలో బాకీలు తీరుస్తాడు. ఎప్పటికైనా పోగొట్టుకున్న డబ్బుని సంపాదించి మళ్ళీ భూమీ పుట్టాకొని అందరి మెప్పు పొందుదామని కలలు కటుంటాడు. ఏనాటికైనా కృష్ణమూర్తి లాగ ప్రొఫెషనల్ ఆటగాడిలాగ పేకాట మీద జీవిద్దాం అనుకుంటాడు. కాలక్షేపానికి కాలక్షేపం, డబ్బుకి డబ్బు పేకాటని మించినది వుందా అనుకుంటాడు.




## తాళం

"ఏరా బుజ్జీ! లెటర్ పోస్టుచేసి రమ్మంటే పట్టుకొచ్చేశావేంరా?" అడిగాడు వెంకట్రావు.

"పోస్టుబాక్సుకు తాళం వేసి వుంది నాన్నా!" అన్నాడు బుజ్జి.

—ఐ.పి. వాట్స్ (గోదావరిఖని)





## ఇవ్వను

‘‘నువు ప్రేమించిన అమ్మాయిని పెళ్ళి చేసుకుంటే నా ఆస్తిలో చిల్లి గవ్వకూడా ఇవ్వను’’ కోపంగా అన్నాడు పరంధామయ్య.

‘‘మరి... ఎవరు ప్రేమించిన అమ్మాయిని పెళ్ళి చేసుకోమంటావు?’’ అడిగాడు బాలు సీరియస్‌గా.

—బి.వి.ఎస్. బాబు (తెనాలి)

అమ్మాయికి పెళ్ళి, తను ఏమి చేశాడు. దాని అదృష్టం బాగుండి ఈ రోజైనా మంచి ముక్కలు పడగూడదా? ఒక వి.ఐ.పి సూట్‌కేసూ, నాలుగు పోలియిస్టర్ చీరలూ కొనిస్తే ఎంత సంతోషిస్తుంది.

ఆలోచనలో మోండా మార్కెట్ దాటేశాడు. పాట్ మార్కెట్ బంగారం దుకాణాల సందు కూడా దాటి పోయాడు. మహంకాళి వీధిలోని రామారావు యింటికి కాళ్ళులాక్కుపోయాయి. సికింద్రాబాదు హైదరాబాదు లోని పేకాట అడ్డలు వెంకటరావుకి బాగా తెలుసు. ఒకవేళ ఓడిపోతేనో అనే ఆలోచనకూడా రాలేదు అతనికి.

వెంకటరావు అంచనా తారు మారు కాలేదు. అప్పటికే మూడు ముక్కలాట జోరుగా సాగుతుంది.

వెంకటరావుని చూడగానే వాళ్ళ ముఖాలు వికసించాయి.

‘‘ఏవయ్యా వెంకటరావు దారి తప్పావు. బహుకాల దర్శనం’’ అన్నాడు రామారావు.

‘‘ముక్కలు వెయ్యమంటావా?’’ అన్నాడు కృష్ణమూర్తి.

‘‘వెయ్యండి నాలుగు ఆటలు ఆడి వెళ్ళిపోతాను’’ అన్నాడు వెంకటరావు. ‘‘అర్జంటు పనివుంది’’ అని కారణం కూడా చెప్పాడు.

‘‘ఎంత జోకేశావ్ గురూ’’ అన్నాడు రామారావు.

‘‘ఎంత తప్పు మాటన్నావు శిష్యా, చెంపలు వాయించుకో. దీనిని మించిన అర్జంటు పనులు ప్రపంచంలో వున్నాయా’’ అని కృష్ణమూర్తి పేక ముక్కల్ని ముద్దుపెట్టుకున్నాడు.

‘‘ఏందయ్యా లొల్లి. ముచ్చట్లాడేటందు కొచ్చినామా ముక్కలాడేటందుకా. పంచుండ్రి. ఏంది గురూ అట్టజూస్తావ్. కూస్తో అని యాదయ్య అతని పక్కని వెంకటరావుకి స్థలం చూపించాడు.

వెంకటరావు కూర్చున్నాడు. ఐదు వందల రూపాయిలకు మించి ఆడకూడదను కున్నాడు. ఐదు వందలు మాత్రం పేంటు జేబులో నుంచి తీసి చొక్కాజేబులోకి మార్చుకొన్నాడు.

‘‘డ్రాప్ ఎంత పెట్టు కుందాం’’ అడిగాడు కృష్ణమూర్తి. వెంకటరావు జేబులు గట్టిగా వున్నాయని పసికట్టారు. వారం రోజుల నుంచీ గట్టికేసు తగలడం లేదని వాళ్ళకి బాధగా వుంది. ఈ రోజు సంపాదనతో ఈ నెల గడిచిపోతుంది అని సరదాపడ్డారు.

‘‘పదిరూపాయిలు’’ అన్నాడు వెంకటరావు.

‘‘సరే’’ అన్నారందరూ.

వెంకటరావు తన ముక్కలు చూసుకున్నాడు. రాణుల జోడీ వచ్చింది. తక్కింది మంచి ముక్కకాదు. వెంటనే డ్రాప్ చేసేశాడు. ఎటువంటి పరిస్థితులలోనూ మంచిముక్కలు పడేదాకా ఆడ దలచు కోలేదు వెంకటరావు.

ఆ ఆట రామారావు గెలిచాడు.

రెండో ఆటకి యాదయ్యముక్కలు పంచాడు.

వెంకటరావుకి రెండు ఆసులు పడ్డాయి. మూడో ముక్క అంతమంచిదికాదు. ఎంత ఆడాలనే తెగింపు వచ్చినా ముక్కలు కింద పడేశాడు. రామారావు కూడా ఆట డ్రాప్ చేసుకున్నాడు. యాదయ్య కృష్ణమూర్తుల మధ్య ఆట చాలా సేపు నడిచింది. యాదయ్య ముక్కలు చూసుకోకుండా చాలాసేపు ఆడాడు. కృష్ణమూర్తి చూసుకునే రెట్టింపు డబ్బు వేస్తూ ఆడుతున్నాడు.

చివరికి యాదయ్య ముక్కలు చూసుకున్నాడు. రెండు జాకీలు చిన్న ముక్క వచ్చాయి. కృష్ణమూర్తి చూసి కూడా ఆడుతున్నాడంటే పెద్ద ఆటే వుండివుంటుంది. చూపమంటే రెట్టింపు డబ్బు యివ్వాలి అని ముక్కలు పారేసి డబ్బు తీసుకోమన్నాడు.

కృష్ణమూర్తి డబ్బు తీసేసుకుని ముక్కలు అందరికీ చూపించాడు. కనీసం జోడీ కూడా లేదు. ఆడకుండా ముక్కలు పడేసి నందుకు వెంకటరావు గించుకున్నాడు. కృష్ణమూర్తి ‘బ్లఫ్’ ఆడాడు. మూడో ఆట వెంకటరావు పంచాడు. అతనికి మంచి ముక్కలు పడలేదు. ఆ ఆట యాదయ్య గెలుచుకున్నాడు.

వెంకటరావు నాలుగో ఆట ఆడి ముక్కలు గనక పడకపోతే నిజంగానే లేచి పోదాం అని నిర్ణయించుకున్నాడు. నలభై రూపాయలతో పీడ విరగడైపోతుంది. అనుకున్నాడు.


నాలుగో ఆటకి కృష్ణమూర్తి పేకలు పంచాలి. కృష్ణమూర్తి వెంకటరావుని కనిపెడుతూనే వున్నాడు. నిజంగానే నాలుగు ఆటలు ఆడి లేచిపోతే ఆశలన్నీ అడియాసలౌతాయి. అందుకనే బాగా కలిపాడు. పావుగంట కలిపాడు. అందరికీ చిరాకు పుట్టేటంత సేపు కలిపాడు. మంత్రాలు వేస్తున్నట్లు కళ్ళు మూసుకుని ధ్యానంలో వున్నట్లు కలిపాడు. అప్పుడు ముక్కలు పంచాడు.

తన ముక్కలని చూడ కుండానే వెంకటరావుని గమనించసాగాడు కృష్ణమూర్తి. వెంకటరావు ముక్కలు చూసుకుని ఉలిక్కిపడ్డాడు. తరవాత ముందు వుంచుకున్నాడు. అంటే తను అనుకున్నట్లు ముక్కలు పడ్డాయని అర్థం చేసుకున్నాడు. తన ముక్కలు చూసుకున్నాడు. తనకీ అనుకున్నట్లే వచ్చాయి. అశ్రద్ధగా కింద తన ముందు పెట్టుకున్నాడు.

ఆట చూసుకుని యాదయ్య, రామారావు ఆట డ్రాప్ చేసుకున్నారు. కృష్ణమూర్తి, వెంకటరావుల మధ్య ఆట జోరుగా సాగింది. రెట్టింపు డబ్బు వేసుకుంటూ పోయారు. చివరికి ముందు జేబులోని డబ్బు అయిపోయింది. వెంకటరావు పేంటు జేబులోని డబ్బు తీశాడు. వేసుకుంటూ పోతున్నాడు. మరో వంద మాత్రమే వున్నాయి.

మరి కొంత డబ్బుంటే ఎంత బాగుండి పోను. మూడు రోజులు. ఎంతైనా సంపాదించుకునే రోజు. పెట్టుబడి ఎవరు పెడతారు. ఎందుకైనా మంచిది అని డబ్బువేసి ముక్కలు చూపించమని అడిగాడు కృష్ణమూర్తిని. ఇది వరకటి ఆటలో ‘బ్లఫ్’ ఆడాడు. మళ్ళీ బ్లఫ్ ఆడుతున్నాడు ముండాకొడుకు అనుకున్నాడు.

కృష్ణమూర్తి మధ్య నున్న డబ్బంతా నొల్లుకోసాగాడు ‘‘ముందు ముక్కలు చూపించు’’ అన్నాడు వెంకటరావు.



కృష్ణమూర్తి మూడు ముక్కలనీ తెరిచాడు. 'మూడు ఆసులు'.

వెంకటరావు పై ప్రాణాలుపైనే పోయాయి. ఒళ్ళంతా చెమటలు కమ్మి వణుకు ప్రారంభమైంది. ఆటలో నుంచి లేచాడు. అతడి మనస్సు మనస్సులో లేదు. మహంకాళి వీధి దాటాడు. ఆటలో టైమ్ తెలియనే లేదు. తీరా చూస్తే ఏడుంపావయింది.

పాట్ మార్కెట్ దగ్గరికి వచ్చాడు. బంగారం దుకాణాలు వెక్కిరిస్తూ చూశాయి. ఇంకెక్కడి బంగారం తన ముఖాన్ని పద్మకి ఎలాగ చూపించ గలడు.

పద్మావతి ముఖం దీనంగా వెంకటరావు కళ్ళల్లో మెదిలింది.

పాపం• ఎన్నిసార్లు మందలించింది. ఎన్ని సార్లు బ్రతిమాలింది. భూములూ ఆస్తీపోతే పోయింది యిప్పుడైనా హాయిగా బ్రతుకుదాం అని ఎన్నిసార్లు కాళ్ళావేళ్ళా పడింది. తను విన్నాడా?

పసి పిల్లవాడైనా ఒక్కసారి నిప్పుమీద చెయ్యి వేస్తాడు. కాలగానే మరి ముట్టుకోడు. జీవితమంతా దానికి భయపడతాడు. తను! ఎన్నిసార్లు నుదురు బొప్పికట్టినా మళ్ళీ మళ్ళీ గుద్దుకున్నాడు. ఓడిపోతున్న ప్రతిసారీ పట్టుదల రెట్టింపై జీవితం యిలా పాడు చేసుకున్నాడు. తనంత మూరుడు ప్రపంచం అంతా గాలించినా దొరకడేమో.

ఈ గుండె ఆగిపోదేం?

అయినా తాను అప్పుడే చావకూడదు; కూతురి వివాహం దూరం నుంచైనా చూడాలి. తరవాత ఎటో పరారీ అయిపోవాలి. పదింతలు డబ్బు సంపాదించిగాని మళ్ళీ పద్మ ముఖం చూడగూడదు. మొండి తనం చేతనే తన బ్రతుకు యిలా తగలడింది. ఆ మొండి తనాన్ని యిప్పుడు వదులుకుని ఏం చెయ్యాలి. ఆపని ఎప్పుడో చెయ్యవలసింది తాడుతెగే దాకా లాగి బొక్క బోర్లాపడిన తరువాత యిప్పుడిక రాజీ ప్రసక్తేలేదు.

నడుస్తున్న వెంకటరావుకి మార్కెట్టు నిండా అరటిపళ్ళ బళ్ళు కనిపించాయి. పద్మావతి డజను అరటి పళ్ళు తెమ్మన్న విషయం జ్ఞాపకం వచ్చింది. కొన్నా తను తీసుకుని వెళ్ళి పద్మకి ఏ ముఖం పెట్టుకుని యివ్వగలడు. ఏ దండీ తాళిబొట్టు? ఏదండీ బంగారం? అనడిగితే ఏమి చెప్పాలి అనుకుని స్టేషను వేపు చేతులూపుకుంటూ గబగబా నడిచాడు.

స్టేషనులోకి ప్రవేశించిన వెంకటరావు గోదావరి బయలు దేరి వెళ్ళిపోతుండడం చూశాడు. గబగబా పరుగెత్తాడు. రైలు చివరనుంచి రెండో పెట్టె రాడ్ చేతికి దొరికింది. కాని నీరసంగావున్న వెంకటరావు రైలు వేగాన్ని అందుకోలేక పోయాడు. బోర్లా పడిపోయాడు. కొంత దూరం రైలు ఈడ్చుకపోయింది. తరవాత చెయ్యి పట్టు తప్పి చివర పెట్టె కిందికి ప్లాట్ ఫారం మీద నుండి దొర్లిపోయి చక్రాల కిందపడ్డాడు. తల చితికి పోయి ఎవరూ గుర్తుపట్టలేకుండా అయ్యాడు. పెట్టెలో నుంచి ఈ దారుణం చూసినవారు చైన్ లాగారు. కొంత దూరం పోయి ప్లాట్ ఫారంకి దూరంగా రైలు ఆగిపోయింది.

రైలు కదిలే దాకా ఆశగా ఎదురు చూసిన పద్మావతికి నిరాసే ఎదురైంది. రైలు కదలగానే తలను లోపలికి తీసుకుంది.

తను ఏమి పాపం చేసింది? భరించువాడు భర్త అంటారు. తనని, తన పిల్లల్ని ఏమి భరించాడు. భర్తని వదిలేసిన స్త్రీకి విలువ పోతుందని యింత కాలం సహించింది. ఇంకతనకి భర్త లేనట్లే, పెళ్ళే కాలేదని వూరుకుంటుంది. మళ్ళీ ఈ హైదరాబాదు ముఖం చూడదు. ఎంత నరకం అనుభవించింది. అన్నయ్యని పంపిస్తే మిషనూ తక్కిన సామానూ తెచ్చేస్తాడు. అమ్మాయి పెళ్ళి ఎలాగూ అయిపోతూనేవుంది. బట్టలు కుట్టే అయినా సురేష్‌ని చదివించుకోవాలి. మళ్ళీ వెనక్కి రాకూడదు అనుకుంది.

ఆలోచనలతో సతమతమౌతున్న పద్మావతికి రైలు ఆగడం, రైలు కింద ఎవరో మనిషి పడ్డాడని అందరూ చెప్పుకోవడం లాంటి వేవీ చెవికి ఎక్కలేదు.

భర్తని మరి క్షమించలేక అంతిమ నిర్ణయం పద్మావతి తీసుకుంది. కాకతాళీయంగానో లేక ఆయిల్లాలి తీర్పు వల్లనో గాని వెంకటరావు ఆ మరునిముషంలోనే అకాలమరణం పాలయ్యాడు.

ఇవేవీ పట్టించుకోని రైలుబండి మళ్ళీకూతవేసి తన పనిమీద తూర్పువేపు దూసుకుపోసాగింది.

*


ఆంధ్రభూమి సచిత్ర వార పత్రిక

కార్టూనిస్టులకు శుభవార్త!

## కార్టూన్ కథల పోటీ!!

ఆంధ్రభూమి సచిత్ర వార పత్రిక దీపావళి ప్రత్యేక హాస్య సంచికను పురస్కరించుకుని కార్టూన్ కథల పోటీ ఏర్పాటు చేస్తోంది. కార్టూనిస్టులు ఉత్సాహంగా పాల్గొని ఈ పోటీని జయప్రదం చెయ్యగోర్తాము.

మొదటి బహుమతి రు. 500.
రెండో బహుమతి రు. 400.
మూడో బహుమతి రు. 300.
మరో రెండు కన్సొలేషన్ బహుమతులు రు. 200.

పోటీకి నియమ నిబంధనలు.

* పోటీకి పంపే కార్టూన్ కథలు ఏ విషయం మీదనైనా వుండవచ్చు.
* కార్టూన్ కథలు పది పేజీలకు మించరాదు.
* ఇండియన్ ఇంక్‌తో కార్టూన్ కథలు ఫుల్ పేజీకి వేయాలి. సైజు 18 23 సెం. మీ. వుండాలి.
* కార్టూన్ కథల వెనక అడ్రసు తప్పనిసరిగా వుండాలి.
* పోటీలో ఎంపిక చేసిన (బహుమతిరాని) కార్టూన్ కథలను మామూలుగా ప్రచురించే హక్కు మాకు వుంటుంది.
* పోటీ విషయంపై తుది నిర్ణయం ఎడిటర్‌దే. దీనిపై ఉత్తర ప్రత్యుత్తరాలకు అవకాశం లేదు.
* కార్టున్ కథలు— ఎడిటర్, ఆంధ్రభూమి సచిత్రవార పత్రిక, 36 సరోజినిదేవి రోడ్, సికింద్రాబాద్ — 3 కు పంపాలి.

* కార్టూన్ కథలు మాకు చేరవలసిన ఆఖరు తేదీ అక్టోబరు 15.